

నేడు సాలూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పార్వతీపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సాలూరులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేయాలని సూచించారు. జిల్లా అధికారులు అందరూ సాలూరులో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.



జై గురుదేవ

- ఘనంగా గురుపౌర్ణమి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జిల్లాలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువజాము నుంచే సాయిబాబా ఆలయాల వద్ద భక్తులు బారులు దీరారు. సాయిబాబాకు పూజలు చేసి.. పాలాభిషేకాలు నిర్వహించారు. కొన్నిచోట్ల కుంకుమ పూజలు, సాయి సత్య వ్రతాలు, చందనోత్సవం, దూప హారతి, పల్లకీ ఉత్సవం, భజన కార్యక్రమాలు, అన్నదానం కూడా చేపట్టారు. భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడాయి. సాయినామస్మరణతో మార్మోగాయి. రాత్రి అన్ని దేవాలయాల పరిధిలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

-గరుగుబిల్లి/పాలకొండ/సాలూరురూరల్



గరుగుబిల్లి:ఉద్దవోలు సాయినాథుని ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



పాలకొండ: నక్కలపేటలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం, ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా





సాలూరురూరల్: సాలూరులో బాబా దర్శనానికి బారులు తీరిన భక్తులు, ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా

జిల్లా వాణి వినిపించేందుకు..

- రాజధానికి వెళ్లిన మంత్రి, ఎమ్మెల్యేలు
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

పార్వతీపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండోసారి అసెంబ్లీ సమావేశాలు జరగనుండడంతో జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తాము ఎన్నుకున్న నేతలు ఎలా వ్యవహరిస్తారో చూడాలని భావిస్తున్నారు. ఏఏ సమస్యలను ప్రస్తావిస్తారు? వాటికి ప్రభుత్వం ఎలాంటి సమాధానం ఇస్తుందో వినాలనుకుంటున్నారు. మొదటి సమావేశాలు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక తదితర ప్రక్రియలు నిర్వహించడానికి పరిమితమయ్యాయి. సోమవారం ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజులు జరిగే అవకాశం ఉంది. ఎన్నికల నేపథ్యంలో గత ప్రభుత్వం మూడు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. జూలై నెలాఖరుతో దీని సమయం ముగియనుంది. తరువాత మరో నాలుగు నెలల కాలానికి కూటమి ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు నిర్ణయించింది. అలాగే, గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన వ్యవస్థలపై శ్వేతపత్రాలు విడుదల చేయడంతో పాటు ప్రజా సమస్యలను ఈ సమావేశాల్లో ఎమ్మెల్యేలు ప్రస్తావించనున్నారు. దీనికోసం జిల్లా ఎమ్మెల్యేలు ఆదివారం సాయంత్రం అమరావతికి బయలుదేరి వెళ్లారు. సాలూరు నియోజకవర్గం నుంచి గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి ఆయా నియోజకవర్గాల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయనున్నారు. ముఖ్యంగా జిల్లాను వేధిస్తున్న ప్రధాన సమస్యలు, ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు, అభివృద్ధి పనుల బాధ్యత మంత్రి సంధ్యారాణి భుజస్కంధాలపై ఉంది.

జంఝావతి కాలువకు గండి

- వెంటనే అప్రమత్తమైన రైతులు
- ఎక్స్‌కవేటర్ సహాయంతో పూడ్చివేత
- వర్షాలకు బలహీనంగా మారిన గట్లు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

గరుగుబిల్లి, జూలై 21: మండలంలోని ఉల్లిభద్ర సమీపంలో జంఝావతి కాలువకు శనివారం రాత్రి గండి పడింది. రైతులు అప్రమత్తమై ఆదివారం ఉదయం గండిని పూడ్చడంతో కాలువకు ఆనుకుని ఉన్న తామర చెరువుకు పెద్ద ప్రమాదం తప్పింది. జంఝావతి ప్రాజెక్టు నుంచి ఈ నెల 4న 200 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రధాన కాలువ నుంచి 100 క్యూసెక్కులు, పిల్ల కాలువ నుంచి 100 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుంది. అయితే, ఈ నీరు ఉల్లిభద్ర వద్ద కాలువలోకి శనివారం రాత్రి ప్రవేశించిన సమయంలోనే గండి పడింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతి పెరిగి కాలువకు గండిపడినట్లు తెలుస్తోంది. గత కొన్నాళ్లుగా కాలువలకు అవసరమైన మరమ్మతులు నిర్వహించకపోవడం తో గండ్లు పడుతున్నాయి. వీటిని పూడ్చేందుకు అవసరమైన నిధులు మంజూరు కావడం లేదు. దీంతో రైతులే స్వయంగా గండ్లను పూడ్చుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. ఉల్లిభద్రకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు మరడాన నారాయణస్వామి తన సొంత నిధులను వెచ్చించి ఎక్స్‌కవేటర్ సహాయంతో జంఝావతి కాలువ గండి పూడ్చారు. గత కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో కాలువ గట్లు బలహీనంగా మారాయి. దీంతో ఎక్కడ గండ్లు పడతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జంఝావతి ప్రాజెక్టు నుంచి 24 వేల ఎకరాలకు పైగా సాగునీరందించాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం 9 వేల ఎకరాలకే పరిమితమయ్యింది. పార్వతీపురం, కొమరాడ, సీతానగరం, గరుగుబిల్లి మండలాలకు అరకొరగానే సాగు నీరు సరఫరా అవుతుంది. దీనిపై జంఝావతి జేఈ పి.శ్రావణి వివరణ కోరగా.. 'ప్రధాన కాలువ పరిధిలో కొమరాడ మండలం విక్రమపురం నుంచి నిడగళ్లు వరకు పలు పనులు నిర్వహించాల్సి ఉంది. నాలుగు పనుల నిర్వహణకు రూ.17.30 లక్షలతో ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరు కాగానే పూడిక తీతలు, కాలువల అభివృద్ధి పనులు చేపడతాం. గత ఐదేళ్లు నిధులు లేక పనులు నిర్వహించలేకపోయాం. కాలువకు గండ్లు పడకుండా సిబ్బందితో పర్యవేక్షణ చేయిస్తున్నాం.' అని తెలిపారు.



పాతకళ్లికోట సమీపంలో నాగావళి నదిని పరిశీలిస్తున్న జేసీ శోభిత

తగ్గుముఖం పట్టిన నాగావళి

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద తగ్గుముఖంపట్టింది. ఆదివారం నదిలోకి పైప్రాంతం నుంచి 1,350 క్యూసెక్కుల నీరు చేరుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.95 మీటర్ల నిల్వ ఉంది. సుమారు 344.49 అడుగుల మేర నిల్వ సామర్థ్యం ఉంది. ఒడిశా ప్రాంతంలో అధికంగా వర్షాలు కురిస్తే వరద వచ్చే పరిస్థితి ఉందని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ముందస్తుగా స్పిల్‌వే గేట్లు నుంచి 1,450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రధాన కాలువల నుంచి సాగునీటి సరఫరాను కొంతమేర తగ్గించారు. వర్షాల కారణంగా గండ్లు పడే అవకాశం ఉన్న దృష్ట్యా తక్కువ స్థాయిలో సరఫరా చేస్తున్నారు. అధికంగా వరదలు వచ్చినా దిగువకు మళ్లించేందుకు ప్రాజెక్టు ప్రాంతంలో అప్రమత్తంగా ఉన్నారు.

తేలికపాటి వర్షాలు

జిల్లాలో ఆదివారం తేలికపాటి వర్షాలు కురిశాయి. 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వీరఘట్టం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో వర్షాలు కురవ లేదు. కొమరాడ మండ లంలో 5.2 మిల్లీ మీటర్లు, సీతంపేటలో 1.0, భామినిలో 1.2, కురుపాంలో 2.2, పార్వతీపురంలో 1.8, మక్కువలో 1.2, సీతానగరంలో 1.4, బలిజిపేటలో 1.8, సాలూరులో 1.0, పాచిపెంటలో 2.4 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది.



గండిని పూడ్చుతున్న దృశ్యం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జేసీ

కొమరాడ: నాగావళి నదీ తీర ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని సంయుక్త కలెక్టర్ ఎస్ఎస్ శోభిత అన్నారు. ఆదివారం పాతకళ్లికోట సమీపంలో నాగావళి నదిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు నది ఒడ్డుకు వెళ్లకుండా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అంతేకాకుండా సమీప గ్రామాల్లో దండోరా వేయించి తెలియజేయాలన్నారు. తుఫాన్ ప్రభావంతో వచ్చే వరదలు, వర్షాలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నదుల్లో వరద సాధారణంగానే ఉందని, ప్రమాద స్థాయి దాటి ఎక్కడా ప్రవహించడం లేదని చెప్పారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. వర్షాల కారణంగా ఇప్పటివరకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో మల్లికార్జునరావు, ఏవో రమేష్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఉధృతంగా సువర్ణముఖి

మక్కువ: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మక్కువ, సీతానగరం మండలాల సరిహద్దు ప్రాంతం కొత్తవలస ఆనకట్టపై సువర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆనకట్టపై నీరు ప్రవహిస్తున్నా ప్రయాణికులు నడుచుకుంటూ అవతలి వైపు ఉన్న పార్వతీపురం పట్టణానికి వెళుతున్నారు. పోలీస్‌శాఖ స్పందించి కొత్తవలస ఆనకట్ట సమీపంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాలు వెళ్లకుండా నియంత్రణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆనకట్ట పైనుంచి ప్రవహిస్తున్న నీరు

మంచం పట్టిన చినమేరంగి దళితవాడ

- పదుల సంఖ్యలో జ్వర పీడితులు
- డెంగ్యూగా వైద్యులు అనుమానం
- వివిధ ఆస్పత్రుల్లో చికిత్స
- కోనేరు నీరే కారణమంటున్న స్థానికులు

జియ్యమ్మవలస, జూలై 21: మండలంలోని చినమేరంగి దళితవాడలో జ్వరాలు విజృంభించాయి. రోజురోజుకూ జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుంది. ప్రస్తుతం చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో 25 మంది వరకు చికిత్స పొందుతున్నారు. కొంతమందిని విశాఖ, విజయనగరం, పార్వతీపురం ఆసుపత్రులకు రెఫర్ చేశారు. మరికొందరు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎక్కువ మంది డెంగ్యూ జ్వర పీడితులుగా వైద్యులు అనుమానిస్తున్నారు. చినమేరంగి సీహెచ్‌సీలో మీసాల చంటి, వెలగాడ కీర్తి, జలుమూరు చిట్టిరాజు, వెలగాడ భారతి, మీసాల రాంబాబు, బి.కావ్య, బి.శారద, ఎస్.సూర్య, బి.శాంతమ్మ, ఎస్.స్వప్న, బి.రత్నం, బి.సుందరమ్మ, బి.సావిత్రమ్మ, బి.రాజేశ్వరరావు, ఎస్.నీలమ్మ, ఎం.సంపత్, ఎస్.స్వర్ణలత, బి.ప్రవీణ్, ఎం.వెంకటమ్మ, బి.పవన్, తదితరులు చికిత్స పొందుతున్నారు. ఎస్.వీరయ్య, బి.హరీష్‌ను పార్వతీపురం కేంద్రాసుపత్రికి వైద్యులు రెఫర్ చేశారు. మీసాల బుల్లిబాబు, బొమ్మాళి అనిల్ విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో, సిరిపురం రవి విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జ్వరాలు ప్రబలడానికి దళితవాడ పక్కనే ఉన్న దాలమ్మ కోనేరు కారణమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కోనేరులోని నీరు ఏళ్ల తరబడి నిల్వ ఉండడంతో మురికి కూపంగా మారిందని, దీంతో దోమలకు ఆవాసంగా మారిందని చెబుతున్నారు. అంతేకాకుండా దుర్గంధంతో అల్లాడిపోతున్నామని వాపోతున్నారు. ఈ కోనేరుని పూర్తిగా పూడ్చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- గత నెల రోజులుగా ఈ దళితవాడను జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. దీంతో జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జగదీష్ పలుమార్లు ఇక్కడ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి చికిత్స అందించారు. అంతేకాకుండా సర్పంచ్ ఎ.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు దళితవాడలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కాలువలు, నేలబావుల్లో బ్లీచింగ్ చల్లించి పరిశుభ్రంగా ఉంచే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ జ్వరాలు ప్రబలడంతో వైద్యాధికారులకు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



ఇదే దాలమ్మ కోనేరు

మలేరియాతో గిరిజన బాలుడి మృతి

గుమ్మలక్ష్మీపురం: మలేరియా జ్వరంతో ఆదివారం ఉదయం గిరిజన బాలుడు మృతి చెందాడు. వంగర గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి మున్నంగి గౌతమ్‌కు ఐదు రోజుల కిందట జ్వరం వచ్చింది. దీంతో తల్లిదండ్రులు తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. రక్తపరీక్షలు చేయగా మలేరియాగా నిర్ధారణ అయింది. దీంతో వైద్యులు చికిత్స అందించారు. అనంతరం గౌతమ్‌ను ఇంటికి తీసుకొచ్చామని, ఆదివారం ఉదయం మృతి చెందాడని తల్లిదండ్రులు రోదిస్తున్నారు.



గౌతమ్ (ఫైల్)

వైద్యులు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- పాలకొండ డివిజన్‌లో పర్యటన

పాలకొండ, జూలై 21: వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం పాలకొండ డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. వాతావరణశాఖ హెచ్చరికల మేరకు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే కాకుండా అన్ని శాఖలు తమ పరిధిలో అవసరం మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాగావళి నదిలో వరద ప్రవాహాన్ని పరిశీలించారు. వర్షాలు అధికంగా కురిస్తే వివిధ రకాల వ్యాధుల బారిన ప్రజలు పడే అవకాశాలు ఉండడంతో ఆసుపత్రుల్లో సేవలు పరిస్థితిని పరిశీలించారు. నాగావళిలో ప్రవాహం సాధారణ స్థాయిలో ఉందని, అయితే ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైతే ప్రజలను అప్రమత్తం చేయా లని రెవెన్యూ అధికారులకు సూచించారు. కాలానుగుణంగా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్న దృష్ట్యా వైద్యులు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలన్నారు. పాల కొండ ఏరియా ఆసుపత్రి, అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వైద్యులు, చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అన్ని రకాల మందులు అందు బాటులో ఉంచాలన్నారు. వర్షాకాలంలో పాముకాటులు సంభవిస్తాయని, తక్షణమే చికిత్సకు సిద్ధంగా ఉండాలన్నారు. గర్భిణులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్యసేవలు అందించాలని సూచించారు. హైరిస్క్ కేసులను గుర్తించి తగిన సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు జరగాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరికరాలు అన్ని అందుబాటులో ఉన్నాయని, వైద్య నిపుణులు ఉన్నారని, వారి సేవలతో ప్రసవాలు పెంచాలన్నారు. ఇతర ఆసుపత్రులకు రెఫరల్ కేసులు తగ్గించాలని కలెక్టర్ సూచించారు. ఏరియా ఆసుపత్రిపై ఎక్కువ భారం పడకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సేవలు బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వి.వి.రమణ, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పోతులగెడ్డలో పూడికలు తీయాలి

పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని పోతులగెడ్డలో పూడికలు తీయాలని జనసేన కార్యకర్తలు దుప్పాడ గణేష్‌నాయుడు, డి.హరి, గులివిందల రాము, పోలినాయుడు, అనంత్, శ్రీరాం, నగేష్, తదితరులు కలెక్టర్‌ను కోరారు. పోతులగెడ్డలో పూడిక పేరుకుపోవడంతో సుమారు వంద ఎకరాల్లో పంట పొలాలు వరద నీటిలో మునిగిపోతున్నాయని వారు వివరించారు. తక్షణమే పూడికతీత పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

దిక్సూచి DIKSUCHI

ఎన్‌ఐపీహెచ్‌ఎంలో డిప్లొమా, పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్‌ఐపీహెచ్‌ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(పీజీడీపీహెచ్‌ఎం)', 'డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(డీపీహెచ్‌ఎం)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే రిటెన్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లలో భాగంగా క్లాస్‌రూమ్ తరగతులు, ల్యాబొరేటరీ తరగతులు, ఫీల్డ్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్టయిపెండ్‌తో కూడిన ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. నిబంధనల ప్రకారం మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ఇండస్ట్రీ స్టాండర్డ్ ప్యాకేజీతో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

పీజీడీపీహెచ్‌ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ బయోసెక్యూరిటీ, పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ హెల్త్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ మొత్తానికి 40 క్రెడిట్లు నిర్దేశించారు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్లాంట్ హెల్త్ ఎక్స్‌పర్ట్‌లుగా, పెస్టిసైడ్ క్వాలిటీ అనలిస్ట్‌లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(కెమిస్ట్రీ) అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికోసం అయిదు సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ ఫీజు: నిరుద్యోగులకు రూ.80,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.2,00,000

డీపీహెచ్‌ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. దీనికి 20 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.40,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** జూలై 30
- **రిటెన్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **రిటెన్ ఎగ్జామినేషన్ తేదీ:** ఆగస్టు 12
- **సెలెక్టయిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 19
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 25 నుంచి
- **వెబ్‌సైట్:** https://niphm.gov.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్‌ఆర్‌ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.



ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఆర్‌ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 2

భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్)-2023



బీఎన్‌ఎస్‌ఎస్‌లో 531 సెక్షన్లు ఉన్నాయి. పాతచట్టమైన సీఆర్‌పీసీలో 484 సెక్షన్లు ఉండేవి. దీని నుంచి 14 సెక్షన్లను ప్రస్తుతం పూర్తిగా తొలగించి, కొత్త చట్టాన్ని మరికొన్ని సవరణలతో తీసుకువచ్చారు.

కీలకాంశాలు

- బీఎన్‌ఎస్‌ఎస్ న్యాయ విచారణలోని వివిధ అంశాలు, దశలకు సంబంధించి కచ్చితమైన కాల అవధులను నిర్ణయించింది. ఉదాహరణకు వాద ప్రతివాదనలు పూర్తయ్యాక 30 రోజుల్లోగా కొన్ని సందర్భాల్లో 60 రోజుల్లోగా కోర్టులు తీర్పులు వెలువరించాలి. అత్యాచార కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్ చేసిన వైద్యులు ఏడు రోజుల్లోగా నివేదికను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌కు అందించాల్సి ఉంటుంది. బాధితులకు కేసు దర్యాప్తు పురోగతిని కేసు నమోదు చేసిన తరవాత 90 రోజుల్లోగా అందించాలి. ఇలాంటి అంశాలు గడువులతో సహా నిర్దేశించారు.
- ఏడు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో తప్పనిసరిగా ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరగాలి.
- వారెంటుతో అయినా, వారెంట్ లేకున్నా జరిపే సోదాలను ఆడియో - వీడియో సహితంగా చిత్రీకరించి మెజిస్ట్రేట్‌కు సమర్పించాలి.
- ఫిర్యాదు మొదలు తీర్పు వరకూ అన్ని దశల్లోనూ సాంకేతిక, మాధ్యమ వినియోగం తప్పనిసరి చేశారు. ఉదాహరణకు ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదు చేయడం, సమన్లు సంబంధిత వ్యక్తులకు వాట్సాప్ ద్వారా కూడా అందించడం, దర్యాప్తు, విచారణ ఆసాంతం దృశ్య-శ్రవణ మాధ్యమాల్లో చిత్రీకరించాల్సి ఉండటం.
- ముద్దాయిని అరెస్ట్ చేయడం అన్ని కేసుల్లో తప్పనిసరి కాదు. ప్రత్యామ్నాయంగా పోలీసులు ముద్దాయి నుంచి మెజిస్ట్రేట్ ముందు హాజరవుతానన్న వాగ్దానంతో కూడిన సెక్యూరిటీ బాండ్‌ను తీసుకోవడం ద్వారా అరెస్ట్ చేయకుండా ఉండవచ్చు.
- బాధితులు నేరం జరిగిన ప్రదేశానికి చెందిన పోలీస్‌స్టేషన్‌లోనే కాక తమకు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి అవకాశం కల్పించే జీరో ఎఫ్ఐఆర్‌ను సంబంధిత ప్రాధికార పోలీస్‌స్టేషన్‌కు 15 రోజుల్లోగా ఫిర్యాదు అందుకున్న పోలీస్‌స్టేషన్ బదిలీ చేయాల్సి ఉంటుంది.
- కొన్ని కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్‌కు సంబంధించి ఏ స్థాయి పోలీసు అధికారి అయినా విన్నవించవచ్చు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి కన్నా దిగువస్థాయి కలిగి ఉండవచ్చు.
- కోర్టులు, వాటి ప్రాధికార పరిధిని క్రమానుగత శ్రేణిలో స్పష్టంగా కిందిస్థాయి కోర్టులు మొదలు సుప్రీంకోర్టు వరకూ పేర్కొన్నారు.
- ఏదైనా నేరానికి సంబంధించి పడే శిక్షాకాలంలో సగానికి పైగా విచారణ ఖైదీగా పూర్తి చేసిన పక్షంలో పూచీకత్తు బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం గతంలో వలే ఉంది. అయితే, అనేక నేరాల్లో ముద్దాయి అయితే, జీవితఖైదు లేదా మరణదండన విధించే నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు బీఎన్‌ఎస్‌ఎస్ ప్రకారం అది వర్తించదు.
- ముద్దాయి అరెస్ట్ కానప్పటికీ అతని చేవ్రాలు, వేలిముద్రలు, రాత, గొంతు రికార్డింగ్ వంటి ఆధారాల సమర్పణకు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.
- ఎవరైనా ముద్దాయి విచారణ నుంచి తప్పించుకోవడానికి పరారీలో ఉన్నప్పుడు, అతన్ని అరెస్ట్ చేసే అవకాశాలు ఇంతలో కనిపించనప్పుడు అతను లేకున్నా న్యాయవిచారణ జరిపి, తీర్పు వెలువరించవచ్చు.
- ఏడు లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు శిక్ష పడే అవకాశమున్న నేరాలకు సంబంధించి ఏదైనా కేసును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటే బాధితులకు తమ అభిప్రాయాన్ని కోర్టుకు విన్నవించుకునే అవకాశం ఇవ్వాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

బీఎన్‌ఎస్‌ఎస్‌పై విమర్శలు

- విచారణ ఖైదీగా శిక్షాకాలంలో సగానికి పైగా కాలం జైలులో గడిపినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు, జీవితఖైదు, మరణదండన వంటి శిక్షలు విధించబడే నేరాలు చేసినప్పుడు గతంలో వలే బెయిల్ లభించకుండా బీఎన్‌ఎస్‌ఎస్ చట్టం నిర్దేశిస్తుంది. అయితే అనేక సెక్షన్లు వర్తించే ఒకే నేరం సాధారణ శిక్షలు పడే నేరం అయినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా పరిగణింపబడి బెయిల్ నిరాకరణకు గురయ్యే అవకాశాలున్నాయి. దీనివల్ల సాధారణ నేరాలకు, తీవ్ర నేరాలకు తేడా లేకుండా పోతుంది. జైళ్లు నిండిపోతాయి.
- అనేక కేసుల్లో చేతి సంకెళ్లు వేయడానికి బీఎన్‌ఎస్‌ఎస్ చట్టం పోలీసులను అనుమతిస్తోంది. అయితే ఈవిధంగా సంకెళ్లు వేయడం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు, మానవహక్కులకు విరుద్ధం. కాబట్టి ఈ అంశం వివాదాస్పదంగా ఉంది.
- ఈ కొత్త చట్టం ప్రకారం పోలీసు కస్టడీ కోరే దర్యాప్తు అధికారి కారణాలు చూపాల్సిన అవసరం లేదు. పోలీసు కస్టడీ సమయం కూడా గతంలో ఉన్న 15 రోజుల నుంచి బీఎన్‌ఎస్‌ఎస్ చట్టం ద్వారా 90 రోజులకు పొడిగించారు. ఈ అంశాల వల్ల పోలీసు అధికారాలు పెరగడం, మానవ హక్కులపై ప్రభావం పడటం వంటి వలసకాలం నాటి(బ్రిటిష్) అణచివేత పరిస్థితులు మరలా తలెత్తుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.
- పరారీలో ఉన్న వ్యక్తులపై న్యాయవిచారణను జరిపి, వారికి శిక్షలు సైతం నిర్ధారించగల అవకాశం ఈ కొత్తచట్టంలో ఉంది. ఇది నిందితులను పట్టుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలన్న ఒత్తిడిని ప్రభుత్వ యంత్రాంగాలపై తగ్గిస్తుంది. అంతేకాక నిందితుల వాంగ్మూలం, అసలు నిజాల వెలికితీత మరుగునపడిపోయే ప్రమాదం కూడా ఉంది.
- ప్రజా జీవనం(పబ్లిక్ ఆర్డర్)కి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అంశాలనే బీఎన్‌ఎస్‌ఎస్‌లో కూడా కొనసాగించారు. దీనివల్ల విచారణాక్రమం(ట్రైల్ ప్రొసీజర్)కి సంబంధించిన చట్టాలు, పబ్లిక్ ఆర్డర్‌కు సంబంధించిన చట్టాలను, వాటిలోని వైవిధ్యతల కారణంగా విడివిడిగా పరిగణించాలా లేదా ఉమ్మడిగా పరిగణించాలా అన్న సందిగ్ధత నెలకొంది. ఈవిధంగా అనేక ప్రొవిజన్స్ అమలులో సందిగ్ధతలు ఉన్నాయి.
- ఒక నేరానికి సంబంధించిన ఆధారాలను సేకరించిన అధికారి స్థానంలో వచ్చిన మరో అధికారికి ఆ ఆధారాలను కోర్టుకు సమర్పించే అధికారాన్ని బీఎన్‌ఎస్‌ఎస్ కల్పించింది. అయితే ఆధారాలు సేకరించిన అధికారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాన్ని ఇది దూరం చేస్తుంది.

కళతప్పిన కృష్ణపట్నం

- అదానీ స్వార్థం, కాకాణి దందాలకు బలి
- కంటైనర్ కార్గో నిలిపివేతతో తీరని నష్టం
- రోడ్డునపడ్డ వేలాదిమంది ఉద్యోగులు
- ఎగుమతుల్లేక సాగు ఉత్పత్తుల ధర పతనం
- గ్రానెట్ పరిశ్రమపైనా పెనుభారం

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

కృష్ణపట్నం పోర్టు.. రాష్ట్రంలో అతిపెద్ద వ్యాపార కేంద్రం. ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కేంద్రం. మూడేళ్ల క్రితం వరకు దేశంలోనే పెద్ద కంటైనర్ కార్గో కేంద్రంగా గుర్తింపు పొందింది. జగన్ ప్రభుత్వంలో పోర్టు యాజమాన్య బాధ్యతలు నవయుగ నుంచి అదానీకి మారడంతో పరిస్థితి మారిపోయింది. అదానీ స్వార్థం, నాటి మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అక్రమ వసూళ్ల కారణంగా పోర్టు క్రమేణా నిర్వీర్యం అయింది. వ్యాపారం తగ్గిందనే సాకు చూపి అదానీ కంటైనర్ కార్గో నిలిపివేసి, సొంత వ్యాపార ప్రయోజనాల కోసం పోర్టును డర్టీ కార్గోగా మార్చివేసింది. తమిళనాడులో అదానీకే చెందిన ఎన్నూరు పోర్టులో బొగ్గు, ఐరన్ కార్గో పట్ల అక్కడ తీవ్ర వ్యతిరేకత రావడంతో కృష్ణపట్నం పోర్టుకు మార్చింది. కంటైనర్ కార్గో నిలిపివేతతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తుల ధరలను పతనం చేసింది. రాయలసీమ గ్రానైట్ పరిశ్రమలను దెబ్బతీసింది. వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులను వీధిన పడేసింది. పోర్టు ఆధారంగా ఏర్పడిన పరిశ్రమలను శాశ్వతంగా మూసేలా చేసింది. వైసీపీ అధికారంలోకి రాకముందు 2009 నుంచి 2019 వరకు ఉజ్వలంగా వెలిగిన కృష్ణపట్నం పోర్టు గత మూడేళ్ల కాలంలో నిర్వీర్యమైంది. పోర్టును నమ్ముకున్న రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారు.



నవయుగ నుంచి అదానీకి

కృష్ణపట్నం పోర్టు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకర్గ రైతుల త్యాగఫలంతో ఏర్పాటైంది. 1996లో పోర్టు స్థాపించారు. 2007 నుంచి కంటైనర్ ఆపరేషన్లు ప్రారంభమయ్యాయి. 2020 మార్చి వరకు ఈ పోర్టు నవయుగ సంస్థ ఆధీనంలో నడిచింది. 2007 నుంచి 2020 వరకు పోర్టులో కంటైనర్ ఆపరేషన్లు అద్భుతంగా నడిచాయి. మొత్తం 14 బెర్తుల్లో 4 బెర్తులు కంటైనర్ కార్గోకు కేటాయించారు. వీటి ద్వారా రాష్ట్రం నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానైట్ తదితరాలు ఎగుమతయ్యేవి. పరిశ్రమలకు సంబంధించిన మిషనరీ తదితరాలు విదేశాల నుంచి దిగుమతయ్యేవి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోర్టుకు గ్రహణం పట్టింది. నవయుగ సంస్థకు ఇబ్బందులు మొదలయ్యాయి. 2020లో పోర్టును అదానీ చేతుల్లో పెట్టకతప్పని పరిస్థితులను నవయుగ సంస్థకు కల్పించారు. ఈ కుట్రలో అప్పటి సీఎం జగన్ హస్తం ఉందనే ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. 2019కి ముందు రాజకీయాలకు అతీతంగా పోర్టులో వ్యాపార కార్యకలాపాలు సాగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక పోర్టుపై ఆ పార్టీ నాయకుల పెత్తనం పెరిగిపోయింది. కరోనా ప్రభావం తగ్గిన వెంటనే అప్పటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృష్ణపట్నం పోర్టు వ్యవహారాల్లోకి కాలుపెట్టారు. ఒకవైపు కాకాణి వర్గం అక్రమ వసూళ్ల దందా సాగిస్తుండగా, అదే సమయంలో అదానీ ముందస్తు వ్యూహంతో బెర్త్ ఇన్‌చార్జిలు, హ్యాండిలింగ్ చార్జీలు భారీగా పెంచేశారు. భరించలేక పలువురు పెద్ద లైనర్లు కృష్ణపట్నం పోర్టుకు రావడం మానేశారు. కృష్ణపట్నం కంటైనర్ బిజినెస్‌లో మస్క్ వాటానే 50 శాతం. ఆయన రెండేళ్ల క్రితమే కృష్ణపట్నం పోర్టు వదిలి పెట్టేశారు. దీంతో కంటైనర్ బిజినెస్ ఒక్కసారిగా సగానికి పడిపోయింది. అదానీకి చెందిన ఎన్నూరు (తమిళనాడు) పోర్టులో ఆ కంపెనీ ఉత్పత్తులైన బొగ్గు, ఐరన్ ఓర్ కార్గో పట్ల స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో బొగ్గు, ఐరన్ ఓర్ తదితర డర్టీ కార్గోను కృష్ణపట్నం మార్చారు. ఇక్కడ వ్యాపారం తగ్గిందనే సాకు చూపి ఎన్నూరు పోర్టును కంటైనర్ కార్గోగా మార్చుకొని, కృష్ణపట్నం పోర్టును డర్టీ కార్గోగా మార్చేశారు. 2024 జనవరి 31 నుంచి పోర్టులో కంటైనర్ కార్గో పూర్తిగా ఆపేశారు. దీంతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానైట్ ధరల పతనం మొదలైంది. ప్రధానంగా నెల్లూరు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి సగటున నెలకు 1000 కంటైనర్ల బియ్యం విదేశాలకు ఎగుమతి అయ్యేది. ఒక్కో కంటైనర్‌లో 25 టన్నుల బియ్యం బస్తాలు చొప్పున నెలకు 25 వేల టన్నుల బియ్యం ఎగుమతి అయ్యేది. పూర్తిగా ఆగిపోవడంతో ఇప్పుడు చెన్నై, ఎన్నూరు పోర్టులపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల అదనపు రవాణా చార్జీలు, హ్యాండిలింగ్ చార్జీలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం వరి ధాన్యం ధరలపై పడుతోంది. కంటైనర్ కార్గో ఆగిపోవడంతో పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.2-3 వేల కోట్లు నష్టపోతుందన్నది అంచనా.

కాకాణి అవినీతితో ముసలం

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ కార్గో మూతపడటానికి ప్రధాన కారణం కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతే అనే వాదన బలంగా వినిపిస్తోంది. 2021కి ముందు పోర్టులో చిన్న చిన్న కాంట్రాక్టు పనులు ప్రధాన పార్టీల నాయకులు పంచుకునేవారు. అధికార పార్టీ నాయకులు 60 శాతం, ప్రతిపక్షనేతలు 40 శాతం పనులు చేసుకునేవారు. కంటైనర్ కార్గో కాంట్రాక్టులను మాత్రం సర్టిఫైడ్ కంపెనీలకే కేటాయించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కంటైనర్ కార్గో కార్యకలాపాల ద్వారా కూడా డబ్బు సంపాదించుకోవాలనే ఆశతో స్థానిక వైసీపీ నాయకులు లారీ అసోసియేషన్ అనే దానిని ఏర్పాటు చేసుకున్నారు. పోర్టులోకి కంటైనర్లను రవాణా చేసే యజమానులను భయపెట్టి అసోసియేషన్‌లో చేర్చుకున్నారు. పోర్టు బయట ఒక టోల్‌గేట్ పెట్టి లారీలను ఆపేయించారు. ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దింపి లారీ టైర్లలో గాలి తీయించారు. పోలీసులు, ఆర్టీఏ అధికారుల ద్వారా తప్పుడు కేసులు పెట్టించారు. ఈ టోల్‌గేట్‌కి కాకాణి టోల్‌గేట్ అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. దీంతో విధిలేక ట్రాన్స్‌పోర్టర్లు అందరూ ఈ అసోసియేషన్‌లో చేరారు. తర్వాత దందాలు మొదలయ్యాయి. ప్రతి వాహనం కాకాణి టోల్‌గేట్ వద్ద రూ.2వేలు చెల్లించాలి. అంతేగాక కంపెనీ లేదా డీలర్ ట్రాన్స్‌పోర్టర్‌కు చెల్లించే అద్దెలో 20 శాతం కమీషన్ ఇవ్వాలి. ఇలా లారీ అసోసియేషన్ పేరుతో ప్రతి లోడుపై రూ.5-7 వేలు దండుకున్నారు. కమీషన్ల బెడదతో ట్రాన్స్‌పోర్టర్లు, డీలర్లు ఈ పోర్టుకు రాకుండా చెన్నై పోర్టుకు వెళ్లడం ప్రారంభించారు. అయినా వైసీపీ గ్యాంగ్ అరాచకాలు ఆపలేదు. అనధికారిక టోల్‌గేట్ ఏర్పాటు చేసి వెంకటాచలం హైవే మీదుగా వెళ్లే వారి నుంచి వసూళ్లు చేసింది. దీన్ని కాకాణి టోల్‌గేట్ నంబర్-2గా పిలిచేవారు.

ఎన్నో అనర్థాలు...

కంటైనర్ కార్గో ద్వారా గతంలో 10 వేలమంది ఉద్యోగులు పోర్టులో పనిచేసేవారు. పోర్టులో 600 కంపెనీల కార్యకలాపాలు ఉండేవి. ఇప్పుడు కార్గో మూతపడటంతో వీరందరూ ఉపాధి కోల్పోయారు. ఆరు వేల ఎకరాల్లో విస్తరించిన పోర్టులో ప్రస్తుతం నికరంగా పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులు 300 నుంచి 400 మంది మాత్రమే. బొగ్గు దిగుమతుల కారణంగా కాలుష్యం విస్తరిస్తోంది. ముత్తుకూరు, చిల్లకూరు మండలాల్లో విషకారకాల వల్ల ప్రజలకు చర్మవాదులు వస్తున్నాయి. బొగ్గురేణువుల కాలుష్యం నెల్లూరు నగరం హరినాథపురం వరకు వస్తోంది. భవిష్యతులో పోర్టు కాలుష్యం నెల్లూరు నగరంతో పాటు గూడూరు, సూళ్లూరుపేట, కావలి, కందుకూరు డివిజన్ల ప్రాంతాలను సైతం కమ్మేస్తుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.



'ఇంటి' దొంగలపై చర్యలేవీ..?

- మంత్రి ఆదేశించినా కదలని హౌసింగ్ ఉన్నతాధికారులు
- విచారణలో తమ పాపాలు కూడా బయటపడతాయనే భయం!
- గత ప్రభుత్వంలో అడుగడుగునా భారీ అవినీతి, అక్రమాలు
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలు బుట్టదాఖలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరుతో గత జగన్ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన పథకం అడుగడుగునా అవినీతిమయమైన సంగతి జగమెరిగిన సత్యం. జగనన్న కాలనీలకు స్థలాల సేకరణ దగ్గరి నుంచి.. మెరక పనుల వరకూ వైసీపీ నేతలు వేల కోట్ల రూపాయలు దోచేశారు. మరోవైపు పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్లు కూడా రూ.వేల కోట్లు కొట్టేసి పత్తా లేకుండా పోయారు. 'మేం మాత్రం తక్కువ తిన్నామా..!' అన్నట్టు హౌసింగ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా బరితెగించి ఈ దోపిడీలో భాగస్వాములయ్యారు. పేదల ఇళ్ల నిర్మాణంలో అవినీతి, అక్రమాల గురించి పత్రికలు, టీవీ చానెళ్లు, సోషల్ మీడియాలో వరుస కథనాలు వెలువడినా జగన్ సర్కారు కనీసం పట్టించుకోలేదు. దీంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోయి ప్రజాధనాన్ని లూటీ చేశారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు మొదలుకొని జిల్లాల్లోని అధికారులు, ఉద్యోగులు, సాధారణ సిబ్బంది వరకూ అందరూ అవినీతికి పాల్పడి పేదలకు తీరని అన్యాయం చేశారు. పేదల ఇళ్ల నిర్మాణం ముసుగులో అడ్డూఅదుపు లేకుండా సాగిన ఈ అవినీతి, అక్రమాలపై నిజాలు నిగ్గు తేలుస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలు ఇచ్చిన నివేదికలను గత వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. అయితే ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పోయి.. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అన్ని ప్రభుత్వ శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన దోపిడీని బయటపెడుతోంది. దీంతో గృహనిర్మాణ శాఖలో జరిగిన భారీ అవినీతి, కుంభకోణాలపై కూడా లోతుగా విచారణ చేసి.. 'ఇంటి' దొంగల భరతం పట్టాలనే డిమాండ్లు అధికమయ్యాయి.

మంత్రి ఆదేశించినా కదలని యంత్రాంగం

గత ప్రభుత్వం ఆప్షన్-3 కింద పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. దాంతో దాదాపు 3.5 లక్షల మంది ఆప్షన్-3 ఎంచుకున్నారు. లబ్ధిదారుల తరఫున ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి దాదాపు రూ.2 వేల కోట్లకు పైగా అడ్వాన్సులు తీసుకున్నారు. ఆ ఇళ్లకు సంబంధించిన సిమెంట్, ఇసుక, స్టీలు, ఇతర మెటీరియల్‌ను కూడా వాడేసుకున్నారు. కానీ చాలామంది కాంట్రాక్టర్లు లాభదాయకంగా ఉన్న బేస్‌మెంట్ లెవెల్ వరకు మాత్రమే పూర్తిచేసి.. తర్వాత నుంచి పనులు చేయకుండా బిచాణా ఎత్తేశారు. ఈ అంశాలన్నీ ఇటీవల అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించినప్పుడు రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి వచ్చాయి. దాంతో మంత్రి సీరియస్‌గా స్పందించారు. కాంట్రాక్టర్లు తీసుకెళ్లిన మెటీరియల్‌ను ఉపయోగించారా...? దుర్వినియోగమయ్యాయా..? అనేది పరిశీలన చేసి కచ్చితమైన సమాచారంతో ఈ నెలాఖరుకల్లా నివేదిక ఇవ్వాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పనులు చేయకుండా పోయిన కాంట్రాక్టు సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టి.. దోపిడీ చేసిందంతా రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. హౌసింగ్ ఉన్నతాధికారులు మాత్రం దీన్ని అంత సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. మంత్రి సమీక్ష ముగిసి 15 రోజులు గడిచినా అధికారులు వేగంగా కదలడం లేదు. ఈ అవినీతి భాగోతంలో భాగస్వాములైన అధికారులే ఈ ప్రభుత్వంలోనూ కొనసాగడమే దీనికి కారణమని హౌసింగ్ వర్గాలే చెబుతున్నాయి. విచారణ చేపడితే తమ పాపాలు కూడా బయటపడతాయనే భయంతోనే తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బిల్డింగ్ మెటీరియల్ కొనుగోళ్లలో ఇష్టారాజ్యం

తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించి పేద అక్కచెల్లెమ్మలకు ఆస్తిగా అందజేస్తాని అధికారంలో ఉండగా జగన్ ఊదరగొట్టారు. కానీ, కేంద్రం వాటా కింద ఇచ్చిన 22 లక్షల ఇళ్లనే మంజూరు చేశారు. వాటిలో కూడా.. ఐదేళ్లలో 5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారు. వీటిలో ఎక్కువ ఇళ్లు లబ్ధిదారులు తమ సొంత డబ్బుతో నిర్మించుకున్నవే. ఇక మిగిలిన 17 లక్షల ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయాయి. అయితే సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ఆప్షన్-3 కింద ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని జగన్ గొప్పలు చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల మందికి పైగా ఆప్షన్-3ని ఎంచుకున్నారు. ఆ ఇళ్ల నిర్మాణ బాధ్యతలను జిల్లాల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించి.. ఒక్కో ఇంటికి రూ.70 వేలు చొప్పున అడ్వాన్సులు చెల్లించారు. అలాగే ఆ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీలును హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ముందే సరఫరా చేసేశారు. అడ్వాన్సు డబ్బులు, సిమెంటు, స్టీలు ముందుగానే తీసేసుకున్న కాంట్రాక్టర్లు చాలా మంది పునాదులు కూడా పూర్తి చేయకుండానే ముఖం చాటేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి.. దాదాపు 22 లక్షల ఇళ్ల కోసమంటూ 13 రకాల నిర్మాణ సామగ్రిని రాష్ట్రస్థాయిలోనే కొనుగోలు చేసి.. లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లాలవారీగా హౌసింగ్ గొడౌన్లకు బలవంతంగా తరలించారు. ఇలా ఒక్కో ఇంటికి రూ.1,12,117 విలువైన సామగ్రిని ముందుగానే కొనుగోలు చేసేశారు. అంటే 22 లక్షల ఇళ్ల కోసమని ఏకంగా దాదాపు రూ.25 వేల కోట్లకు పైగా విలువైన నిర్మాణ సామగ్రిని ముందుగానే కొనుగోలు చేయడం వెనుక భారీ కుంభకోణమే దాగి ఉంది. ఈ సామగ్రిని కొనుగోలు చేయడానికి టెండర్లు పిలవడానికి ముందే ఆయా కంపెనీలతో కమీషన్లు, పర్సంటేజీలు మాట్లాడుకుని రూ.వందల కోట్లు మింగేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

గోడౌన్లలో తుప్పు పట్టిపోతున్న సామగ్రి

నాసిరకం నిర్మాణ సామగ్రిని ఎక్కువ ధరలకు అంటగడుతుండటంతో లబ్ధిదారులతో పాటు కాంట్రాక్టర్లు కూడా వాటిని తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లలో నిల్వ చేసిన మెటీరియల్ తుప్పు పట్టి పాడైపోతోంది. దాదాపు మూడొంతులకు పైగా సామగ్రి జిల్లాల్లోని గోడౌన్లలోనే అలాగే ఉండిపోయింది. వెంటనే ఆ సామగ్రిని లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో.. వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండానే ఇచ్చేసినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు నమోదు చేసేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారితే మొదటికే మోసం వస్తుందన్న భయంతో మే నెలాఖరుకల్లా గోడౌన్లలో ఉన్న మొత్తం స్టాక్‌ను లబ్ధిదారులకు సరఫరా చేసేయాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో జిల్లాల్లోని ఏఈలు, డీఈలు, ఈఈలు, జిల్లా హెడ్స్ అందరూ ఒక్కసారిగా అలెర్ట్ అయిపోయి.. పది రోజుల్లోనే ఏకంగా 5,11,629 పరికరాలను లబ్ధిదారులకు ఇచ్చేసినట్లుగా ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు నమోదు చేసేశారు. దాదాపు 90 శాతం వరకు లబ్ధిదారులకు ఇచ్చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేశారు. ఈ మెటీరియల్స్ విలువ రూ.154 కోట్ల పైమాటే. ఈ మెటీరియల్ సరఫరాలో నిజాలు నిగ్గు తేలాలంటే లబ్ధిదారులను కలిసి విచారణ చేస్తే మొత్తం అవినీతి బాగోతం బయటపడుతుంది.

ఎవరెక్కడికో?



- తహసీల్దార్‌లను సొంత జిల్లాలకు పంపిన ప్రభుత్వం
- మండలాలను కేటాయించనున్న కలెక్టర్
- పైరవీల్లో రెవెన్యూ అధికారులు
- జిల్లాల విభజనతో చిక్కుల్లో కొందరు

శృంగవరపుకోట, జూలై 21:

● ఉమ్మడి విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని ఓ మండలంలో పనిచేసిన తహసీల్దార్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్వతీపురం డివిజన్‌కు పంపించింది. ఈ తహసీల్దార్ ఐదేళ్లుగా కుటుంబా నికి దూరంగా పనిచేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టడంతో తిరిగి ఈ నియోజకవర్గ పరిధిలోని ఏదో ఒక మండలంలో పనిచేయాలని ఆశించారు. అయితే ప్రభుత్వం ఏ జిల్లా తహసీల్దార్‌లను ఆ జిల్లాకు తిరిగి పంపించడంతో జిల్లాల విభజన కారణంగా ఈ తహసీల్దార్ విభజిత విజయనగరం జిల్లాకు వచ్చేఅవకాశం లేదు.

● వైసీపీ ప్రభుత్వంలో శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలో ఓ తహసీల్దార్ సుదీర్ఘకాలం పని చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో మరో మండలానికి బదిలీ అయ్యారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే తిరిగి శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలో పని చేస్తున్న మండలానికి వచ్చేలా అప్పటి ప్రజా ప్రతినిధితో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే వైసీపీ ఘోరపరాజయం పొందడంతో ఇదే తహసీల్దార్ అధికారంలో వున్న తెలుగు దేశం పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు.

- ఇలా కొంత మంది తహసీల్దార్‌లకు దురదృష్టం వెంటాడి ప్రయత్నాలకు గండిపడుతుంటే.. మరి కొంతమంది తహసీల్దార్‌లకు అదృష్టం తలుపుతడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఏం జరుగుతోందో చూడాలి. సార్వత్రిక ఎన్నికల విధుల కోసం జిల్లాలోని తహసీల్దార్‌లు ఇతర జిల్లాలకు వెళ్లారు. ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లు జిల్లాలో పనిచేసేందుకు వచ్చారు. జోన్-1లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు వున్నాయి. ఈ ఐదు జిల్లాలకు చెందిన 138 మంది తహసీల్దార్‌లు ఓ జిల్లా నుంచి మరో జిల్లాకు ఎన్నికల విధుల నిర్వహణకు మారారు. జూన్ 6తో ఎన్నికల కోడ్ ముగియడంతో వీరిని ప్రభుత్వం సొంత జిల్లాలకు పంపించేందుకు భూపరిపాలన శాఖ చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి ఈనెల 20 జీవో విడుదల చేశారు. డివిజన్ స్థాని కత వున్న తహసీల్దార్‌లను మరో డివిజన్‌కు బదిలీ చేయాలన్న ఆదేశాలు వున్నాయి. ఆ ప్రకారం డివిజన్ టూ డివిజన్ బదిలీకు ఆస్కారం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో పనిచేసిన తహసీల్దార్‌లు డివిజన్ స్థానికత లేకుంటే గతంలో పనిచేసిన మండలంలోనూ పోస్టింగ్ పొందవచ్చు. లేదంటే పక్క మండలానికి రావచ్చు. ఉమ్మడి జిల్లాలో బదిలీ అయిన తహసీల్దార్‌లు మాత్రం ప్రత్యేక జిల్లాలోనే పనిచేయాల్సి వుంటుంది.

జిల్లాల విభజనతో చిక్కులు

వైసీపీ అధికారంలో వున్న సమయంలో తమకు అనుకూలంగా పనిచేసే తహసీల్దార్‌లను ఏరికోరి తెచ్చుకున్నారు. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వున్నారన్న అనుమానం వుంటే చాలు వారిని డివిజన్ దాటి బదిలీలు చేయించేవారు. డివిజన్ దాటి వంద కిలోమీటర్ల దూరం పంపించారు. ఆ తరువాత శ్రీకాకుళం, విజయనగరం,విశాఖపట్టణం ఉమ్మడి జిల్లాలను విభజించారు. దీంతో విజయనగరం జిల్లాలో వున్న పార్వతీపురం డివిజన్ మన్యం జిల్లాగాను, విశాఖపట్టణం జిల్లాలోని అనకాపల్లి, పాడేరు (అల్లూరిసీతారామరాజు) జిల్లాలుగా ఆవిర్భవించాయి. ఉమ్మడి జిల్లాలుగా వున్న సమయంలో బదిలీ జరిగిన తహసీల్దార్‌లు ప్రత్యేక జిల్లాల్లో చిక్కుకున్నారు. పాత జిల్లాలకు రావాలంటే భూపరిపాలన శాఖ నుంచి జిల్లా ఎలాట్‌మెంటు తెచ్చుకోవాల్సివుంటుంది. ఇదంతా రాష్ట్ర స్థాయిలో జరగాల్సిన పక్రియ. దీంతో అప్పుడు వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన తహసీల్దార్‌లే టీడీపీ ప్రభుత్వంలోనూ పనిచేయనున్నారు.

కొంత మంది గతంలో పనిచేసిన మండలంలో పోస్టుంగ్‌కు చూస్తుంటే.. మరికొందరు అదే నియోజకవర్గంలోని పక్క మండలానికి మారేందుకు చూస్తున్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు పొందినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇటీవల పదోన్నతి పొందిన గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సిఫార్సు లేఖలకు విలువ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఆయా తహసీల్దార్‌లు కొంత టెన్షన్ పడుతున్నారు.

భారతీయ సంస్కార ప్రతిభా పరీక్ష

లక్కవరపుకోట: సుపద ఆధ్వర్యంలో ఆదివారం భారతీయ సంస్కార ప్రతిభా పరీక్ష ఎల్.కోటలో నిర్వహించారు. అంకాజ్యోష్యుల శ్రీహరిశర్మ సమక్షంలో వేదపఠనం, హనుమాన్ చాలీసా, శ్రీమద్రామాయణం, ఆదిత్య హృదయం, బాల, అయోధ్య, అరణ్యకాండ, శ్రీకృష్ణ చరితామృతం వంటి విభాగాల్లో 1 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 8 పాఠశాలల నుంచి 164 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్.కోట, లింగంపేట, కొట్యాడ, ఎల్.కోట, శింగరాయి, సోంపురం గ్రామాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని శర్మ తెలిపారు. ప్రతి గురుపౌర్ణమి రోజు ఇటువంటి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమాన్ని నిర్వహించామని లైబ్రేరియన్ సీహెచ్. కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులచే ఆర్యబట్టా కథలు, చందమామ కథలు, అక్బర్, బీర్బల్ కథలు, నీతి కథలు చదివించామన్నారు. గాంధీజీ జీవిత చరిత్రతోపాటు దేశ నాయకుల చరిత్ర తెలిపే పుస్తకాలు చదివించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైస్కూల్ టీచర్ కే.విస్సుతోపాటు విద్యార్థులు హాజరయ్యారు.

అనుమతుల్లేని పశువధశాలలను ఎత్తి వేయాలి

విజయనగరం దాసన్నపేట: అనుమతుల్లేకుండా నగరంలోని పలు ప్రాంతాల్లో పశువధ శాలలు ఉండడాన్ని నిరసిస్తూ, తక్షణమే వాటిపై అధికారులు చర్యలు చేప ట్టాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ కోరారు. ఆదివారం గో సంరక్షణ కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వీటిపై ఈ నెల 8న భారీ ఎత్తున ధర్నా చేపట్టామన్నారు. దీనిపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపడ తామని చెప్పారని, కానీ ఇంత వరకూ ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. తక్షణమే చర్యలు చేపట్టాలని, లేదంటే భవిష్యత్తులో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు.

వాలీబాల్ క్రీడాకారుడు నాయుడు మృతికి సంతాపం

విజయనగరం రూరల్: వాలీబాల్ క్రీడాకారుడు నాయుడు మృతి పట్ల ఎంఆర్ వాలీబాల్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం ఎంఆర్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో సంతాపం ప్రకటించారు. నాయుడు వాలీబాల్ క్రీడకు ఎంతో సేవ చేశారని, ఆయనతో క్రీడాకారులకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మృతికి సంతాపంగా క్లబ్ సభ్యులు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కార్పొరేటర్లు జకీర్, శ్రీనివాసరావు, క్లబ్ ప్రతినిధులు మనోహర్, భాస్కరరావు, ప్రసాద్, ఎం శ్రీనివాసరావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ ఉత్సవాలను విజయవంతం చేయాలి

గుమ్మలక్ష్మీపురం: ఆగస్టు 9న నిర్వహించే ఆదివాసీ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని గిరిజన సంఘాల నాయకులు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైటీసీలో అన్ని గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకొనేందుకు ఆదివాసీలకు ఈ ఉత్సవాలు ఒక వేదిక కావాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం కోశాధికారి మండంగి రమణ, ఆదివాసీ నాయకులు మండంగి భూషణ, కద్రక మల్లేశ్వరరావు, నందివాడ కృష్ణబాబు, కద్రక కళావతి, వెంకటాపు భారతి, బిడ్డిక పద్మావతి, యూటీఎఫ్ మండల కార్యదర్శి పత్తిక శంకరరావు, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్, ట్రైబుల్ రైట్ ఫోరం అధ్యక్షుడు రొబ్బ లోవరాజు పాల్గొన్నారు.

రేపు పోలమాంబకు శాకంబరి ఉత్సవం

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి వద్ద ఆషాడమాసం పురస్కరించుకుని మంగళవారం వివిధ రకాల కాయగూరలు, పండ్లతో అలంకరించి శాకంబరి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం, ప్రసాదం స్వీకరించాలని కోరారు.

నేటి నుంచి శిక్షా సప్తాహ్

కురుపాం: కేంద్ర ప్రభుత్వం, సమగ్ర శిక్షా రాష్ట్ర పథకం సంచాలకులు ఆదేశాల మేరకు ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020 ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నుంచి ఈనెల 28 వరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో విద్యార్థులు ఉపాధ్యాయులు, స్థానికులు భాగస్వామ్యం కావాలని కోరారు.

మానవహక్కుల రక్షణకు కృషి చేస్తా

రామభద్రపురం: మానవ హక్కుల రక్షణకు తన వంతు కృషి చేస్తానని ఇన్డో హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షునిగా ఎన్నికైన కనకల ధర్మారావు తెలిపారు. ఇటీవల జాతీయ కమిషన్ చైర్మన్ ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు అచ్చిరెడ్డి తనను రామభద్రపురం మండల అధ్యక్షుడిగా ఎంపిక చేశారన్నారు. తనకు వచ్చిన ఈ పదవిని బాధ్యతగా నిర్వహించి సామాన్య ప్రజల హక్కుల సంరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు నావంతు కృషి చేస్తానన్నారు.

మండలాల్లో పరిష్కారాలు కావట్లేదనా..?

- జిల్లా కేంద్రానికి వస్తున్న అర్జీదారులు
- మండలాల్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'పై అసంతృప్తి
- ఇకపై పక్కాగా అమలు చేయాలంటున్న కలెక్టర్

మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు ప్రతి సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వస్తున్న వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. జిల్లా కేంద్రంలో వినతులు అందజేసినప్పటికీ తిరిగి వాటి పరిష్కారం కోసం మండల అధికారులకే పంపించాల్సి ఉంటుంది కనుక అర్జీదారులంతా మండల స్థాయిలోనే పరిష్కరించుకోగలిగే సమస్యలపై ముందుగా అక్కడే వినతులు ఇవ్వాలి.
-కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

(కలెక్టరేట్)

ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినతుల్లో అధికంగా మండల స్థాయిలో పరిష్కారం చేయాల్సివే. ఎక్కువగా భూ సమస్యలపై వినతులు వస్తున్నాయి. అర్జీదారులు అందజేస్తున్న వినతులపై మండలస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి పరిష్కారం చేస్తే అర్జీదారులు వ్యయ ప్రయాసలు పడి జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదు. కానీ మండల స్థాయిలో ఈ ప్రక్రియ పూర్తిగా అమలు కావడం లేదు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినతులు స్వీకరిస్తున్న తీరు ఒక్కటే. కాకపోతే ప్రభుత్వం మారినప్పుడు వినతులు స్వీకరించే ఈ కార్యక్రమానికి పేరును మాత్రం కాస్త మార్పు చేస్తున్నారు అంతే. తమ సమస్యను మండల స్థాయిలో అధికారులకు వినతులు అందజేస్తే అక్కడ పరిష్కారం కాదని, జిల్లా కేంద్రంలోని కలెక్టరు, జేసీలకు ఇస్తే పరిష్కారం అవుతుందనే నమ్మకం అర్జీదారుల్లో బలంగా ఉంది. ఈ పరిస్థితుల్లో అర్జీదారులు అంతా జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేసినా తిరిగి చివరకు మండల అధికారులకే ఆయా సమస్యను పరిష్కారం కోసం పంపిస్తున్నారు. ఇకనైనా మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం ప్రజా సమస్య పరిష్కారం వేదికలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారం చేస్తే వారికి న్యాయం జరగడంతో పాటు ప్రభుత్వం లక్ష్యం నేరవేరుతుంది. ఇకనైనా మండల స్థాయి అధికారులు, కలెక్టర్ ఆదేశాలను ఏమేరకు పాటిస్తారో చూడాలి.


కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ (ఫైల్)

జగన్ శవ రాజకీయాలను ప్రజలు నమ్మరు

- రాష్ట్రపతి పాలన విధించాలనడం సిగ్గు చేటు
- అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సత్యనారాయణ

గరుగుబిల్లి: వైసీపీ నాయకుడు జగన్‌రెడ్డి చేస్తున్న శవ రాజకీయాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అరకు నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం చిలకాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నరమేధం సృష్టించిన జగన్‌కు శాంతి భద్రతలు అప్పుడు కనిపించలేదా అని ప్రశ్నించారు. గ్యాంగ్‌వార్లకు అండదండలుగా నిలిచి రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన జగన్‌కు శాంతిభద్రతల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. రాజకీయ హత్యలకు పాల్పడేది వైసీపీయేనని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టి ఐదేళ్లు దోపిడీతోనే కాలయాపన చేశార న్నారు. జగన్‌రెడ్డి చేసిన నిర్వాకంతోనే ప్రజలు తగిన బుద్ధి చెప్పి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలనడం సిగ్గు చేటన్నారు. ఐదేళ్లపాటు దారుణాలకు పాల్పడినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ధైర్యంగా ఎదుర్కొన్నారన్నారు. అరాచక పాలన సాగించినా రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేయలేదన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా తప్పించుకొనేందుకే ఢిల్లీ ధర్నా అని ఎద్దేవా చేశారు. జగన్ వెంట ఏ రాజకీయ పార్టీలు వెళ్లేందుకు సిద్ధంగా లేదని, వైసీపీ ఒంటరిగానే మిగులుతుందన్నారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో తాడేపల్లి ప్యాలె స్‌కు పరిమితమైన వ్యక్తికి ప్రజాస్వామ్యం గురించి ఎలా తెలుస్తుందన్నారు. మాజీ ఎంపీపీ డి.గౌరమ్మ, పార్టీ ప్రతినిధులు బి.నారాయణస్వామి, కె.బలరాంనాయుడు, ఎ.నారాయణరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయండి

- నీటిపారుదలశాఖ మంత్రిని కలిసిన సంధ్యారాణి

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రాజెక్టుల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు.ఈ మేరకు నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి ఆదివారం కలిశారు.ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో జైకా నిధులు పూర్తిగా దారి మళ్లించిందని, దీంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారని తెలిపారు. జిల్లాలో పెద్దగెడ్డ, వెంగళరాయ సాగర్, ఆండ్ర, పూర్ణపాడు, లాబేసు, తోటపల్లి, జంఝావతి రిజర్వాయర్లు ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు.గత ప్రభుత్వంలో జైకా నిధులు పలు ప్రాజెక్టులకు ఐదు శాతం నుంచి 20 శాతం వరకు మాత్రమే నిధులు వెచ్చించగా పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా దారి మళ్లించారని ఆరోపించారు. నిలిచిపోయిన ప్రాజెక్టు పనులు త్వరలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ చర్యలు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. అన్నపూర్ణ వంటి ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఆత్మహత్యలు చేసుకోనే విధంగా గత ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. మన ప్రభుత్వంలో రైతేరాజు అనే విధంగా రిజర్వాయర్లు ఆధునీకరణకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.


రామానాయుడుకు సమస్యలపత్రాన్ని అందజేస్తున్న సంధ్యారాణి

అక్రమ స్పీడ్ బ్రేకర్లు తొలగింపు

వంగర: రాజాం ప్రధాన రహదారిలో సరసనాపల్లి వద్ద కొందరు అక్రమంగా ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్లను ఆదివారం ఆర్అండ్‌బీ అధికారులు తొలగించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో అక్రమంగా స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుతో తరచూ ప్రమాదాలు అనే శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయరాదని, తప్పని పరిస్థితుల్లో ఏర్పాటు చేయాల్సి వస్తే ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలన్నారు.


స్పీడ్ బ్రేకర్లు తొలగిస్తున్న దృశ్యం

త్రుటిలో తప్పిన ప్రమాదం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభం

తెర్లాం, జూలై 21: మండ లంలోని విద్యుత్ స్తంభం నేలకొరగ డంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. కాలంరాజుపేట గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభం ఆదివారం నేలకొరిగింది. ఈ సమయంలో కరెంటు లేకపోవ డంతో పెనుప్రమాదం తప్పింది. వెంటనే గ్రామస్థులు సంబంధిత అధికారులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖా సిబ్బంది వచ్చి మరమ్మతులు చేపట్టారు.


కాలంరాజుపేటలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఘనంగా మహాసామ్రాజ్య పట్టాభిషేకం


కలశపూజ చేస్తున్న రుత్వికులు

సాలూరు రూరల్: స్థానిక పంచముఖేశ్వరాలయంలో లలితా బాలత్రిపుర సుందరి మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సనాతన ధర్మపరిషత్ వ్యవస్థాపకుడు వెలవలపల్లి పంచముఖేశ్వర శర్మ పర్యవేక్షణలో వినయశర్మ తదితర 11 మంది రుత్వికులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవంలో భాగంగా 1008 కలశాల పవిత్ర జలంతో అభిషేకాలు చేశారు. నారికేళాభిషేకం, చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి అమ్మవారి కల్యాణోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు గంటా వెంకటరాజు, ఆరిపాక తిరుపతిరావు, సనాతన ధర్మపరిషత్ అధ్యక్షుడు కొలకోటి శంకరరావు,లలితా భక్త బృందం,సనాతన ధర్మపరిషత్ సభ్యులు, 311 మంది అమ్మవారి పూజ దీక్షాధారులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పిస్తాం

పార్వతీపురం రూరల్: వర్షాలు వల్ల గోడలు కూలి అవకాశం ఉంటుందని, పునరావాసం కల్పిస్తామని, తరలిరావాలని తహసీల్దార్ ఆనంద్ కోరారు. ఆదివారం మండలంలోని అడ్డాపుశీల తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పూరిళ్లలో నివసిస్తున్న గ్రామస్థులతో మాట్లాడారు. వర్షాలు తగ్గాయని, పెరిగితే తప్పనిసరిగా పునరావాస ప్రాంతానికి వస్తామని గ్రామస్థులు తెలిపారు.


పూరి ఇళ్లల్లో నివసిస్తున్న వారితో మాట్లాడుతున్న ఆనంద్

మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు బీమా

- చెక్కులు పంపిణీ చేసిన జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

బొబ్బిలి: బొబ్బిలి మండలం పారాది గ్రామానికి చెందిన పేకేటి ధర్మతేజ అనే జనసేన కార్యకర్త కుటుంబానికి ఐదులక్షల రూపాయల బీమా చెక్కును రాష్ట్రజనసేన ప్రధానకార్యదర్శి కొణిదెల నాగబాబు అందజేసినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ చెక్కును అందజేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో 23 ఏళ్ల పేకేటి ధర్మతేజ మృతిచెందిన సంగతి తెలిసిందే. దీంతో మృతుని తల్లి సావిత్రి, అన్న సురేష్‌లకు నాగబాబు బీమా చెక్కును అందజేశారన్నారు. ● **రామభద్రపురం:** మండల కేంద్రం కనిమెరక వీధికి చెందిన జనసేన కార్యకర్త పెదపల్లి భాస్కరరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనిదెల నాగబాబు మృతుని భార్య జ్యోత్స్నకు రూ.5 లక్షల చెక్కును మంగళగిరి ఆఫీసులో ఆదివారం అందజేశారు. ఈ మేరకు జనసేన బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిరడ అప్పలస్వామి, జనసేన జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి ధనంజయ్‌ల సమక్షంలో ఈ చెక్కును అందించారు. ● **కొత్తవలస:** ప్రమాదవసాత్తు రైలు కిందపడి మృతి చెందిన కొత్తవలస మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నక్కరాజు సతీష్ కుటుంబానికి జనసేన పార్టీ 5 లక్షల రూపాయల బీమాను అందచేసింది. మండలంలోని దేవాడ గ్రామానికి చెందిన నక్కరాజు సతీష్ గత సంవత్సరం కొత్తవలస రైల్వే గేట్ సమీపంలో మృతి చెందాడు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు అయిన సతీష్ భార్య నక్కరాజు లక్ష్మి, తల్లి నక్కరాజు అచ్చియ్యమ్మలకు 5 లక్షల రూపాయల చెక్‌ను అందచేసినట్టు జనసేన శృంగవరపుకోట ఇన్‌చార్జి వబ్బిన సత్యనారాయణ తెలిపారు. ● **చీపురుపల్లి/ గరివిడి:** గరివిడి మండలంలోని కాపుశంభాం గ్రామానికి చెందిన ఓ జనసేన కార్యకర్త కుటుంబానికి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కర్నపు అక్కలనాయుడు ఇటీవల రైలు ప్రమాదంలో దుర్మరణ పాలయ్యారు. ఈ మేరకు ఆదివారం మృతుని కుటుంబానికి మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నాగబాబు రూ.5లక్షల చెక్కును అందజేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తలు చందక బాలకృష్ణ, జనసేన శంకర్ తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి: పేకేటి ధర్మతేజ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాగబాబు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సాలూరు, జూలై 21: కుటుంబ కలహాల కారణంగా మున్సిపల్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో ప్లానింగ్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దేవిశ్రీప్రసాద్ కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురై శనివారం రాత్రి పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించి అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం కోసం చేర్పించారు. అక్కడి నుంచి అనుమతి లేకుండానే ఆదివారం ఉదయం ఇంటికి వెళ్లిపోయాడని ఏరియా ఆసుపత్రి వైద్యులు సందీప్ తెలిపారు. ఈ విషయానికి సంబంధించి పట్టణ ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా మున్సిపల్ ఉద్యోగి కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని, దీనికి సంబంధించి ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

జూట్ కార్మికులకు న్యాయం చేయండి

కొత్తవలస, జూలై 21: అన్నదమ్ముల ఆస్తుల గొడవల కారణంగా కార్మికులను ఉమా జూట్ మిల్లు యాజమాన్యం రోడ్డు పాల్జేసిందని మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేటలో ఉన్న ఉమాజూట్‌మిల్లులో పని చేస్తున్న కార్మికులు ఆరోపించారు. ఆదివారం జూట్‌మిల్లు కార్మిక సంఘం అధ్యక్షుడు గణేష్ పండా మాట్లాడుతూ కార్మికులకు న్యాయం చేయాలంటూ కార్మికులమంతా శృంగవరపుకోట శాసన సభ్యురాలికి వినతిపత్రం అందచేశామన్నారు. మిల్లును తెరిపించేందుకు వెంటనే జోక్యం చేసుకోవాలని లలిత కుమారిని కోరినట్టు తెలిపారు. జూన్ నెలలో కార్మికులు పని చేసిన రోజులకు జీతాలు, బకాయిపడిన పీఎఫ్‌లను, ఈఎస్ఐలను, గ్రాట్యూటీలను చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గత సంవత్సరం నుంచి యాజమాన్యం సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, కార్మికుల నుంచి వసూలు చేసిన పీఎఫ్, ఈఎస్ఐలను ప్రభుత్వం వద్ద జమ చేయడం లేదన్నారు. పదవీ విరమణ చేసిన, చనిపోయిన 100 మంది కార్మికులకు, కుటుంబాలకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ ఇంతవరకు చెల్లించలేదన్నారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జూట్ బిల్లు కార్మికులు కె.శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద పాల్గొన్నారు.



లలిత కుమారికి వినతి పత్రం ఇస్తున్న జూట్ కార్మిక సంఘం నాయకులు

యోగా గురువు సుందర శివరావుకు సన్మానం

విజయనగరం దాసన్నపేట: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆరి సుందర శివరావు ఆధ్వర్యంలో యోగా శిక్షణ పొందుతున్న వారంతా ఆయనను రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సుందరశివరావు మాట్లాడుతూ, యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బీపీ, షుగర్, సయాటికా, బ్యాక్‌పెయిన్, మొదలైన రుగ్మతలు పోవడానికి ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం వంటివి ఉపయోగపడతాయని, వీటితో మానసిక ప్రశాంతత కలుగుతుందని వివరించారు. గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

లైంగిక వేధింపులను ఉక్కుపాదంతో అణిచివేయాలి

బొబ్బిలి: మహిళలపై విచక్షణారహితంగా పెరిగిపోతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, హత్యలు, అవమానాలు వంటివాటిని ఉక్కుపాదంతో అణచివేయాలని జిల్లా ఐద్వా అధ్యక్షురాలు కె.పుణ్యవతి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. రామభద్రపురం మండలంలో ఆరునెలల పసికందుపై తాత వరుస వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడిన ఘటనతో సభ్యసమాజం కుంగిపోతున్న తరుణంలో తాజాగా బొబ్బిలి పట్టణంలో కన్న తండ్రి 11 ఏళ్ల బాలికపై అత్యాచారయత్నానికి ఒడిగట్టడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో చాలా సీరియస్‌గా వ్యవహరించకపోతే ఈ తరహా నేరాలు పెచ్చుమీరిపోతాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్‌మీడియా పేరుతో కొంతమంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని, నేరాలను ప్రేరేపించే విధంగా పోస్టింగ్‌లు పెడుతున్నారని, వాటిని కట్టడి చేయాలన్నారు. మద్యం, గంజాయి, ఇతర మత్తుపదార్థాలను వయస్సుతో నిమిత్తం లేకుండా మైనర్లు సైతం వినియోగిస్తున్నారని ఇది చాలా ప్రమాదకర పరిణామమన్నారు. పోలీసు యంత్రాంగం గట్టి నిఘా పెట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని పూర్తిస్థాయిలో నిరోధించాలని పుణ్యవతి డిమాండ్ చేశారు.

సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేయాలి

చీపురుపల్లి: సచివాలయాల్లో పని చేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వారి సమస్యలను జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ప్రస్తావించామని ఏపీ ఎన్జీవో తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.అప్పలనాయుడు, బి.సురేష్ తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు తక్షణమే చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరామన్నారు. ఎన్జీవో సంఘంలో గజిటెట్ ఉద్యోగులను చేర్చుకోవాలన్న ప్రతిపాదనపై సర్వత్రా హర్షం వ్యక్తమయ్యిందని వారు తెలిపారు.

శ్రమదానంతో రహదారి పనులు

వంగర: బాగెమ్మపేట రహదారి పూర్తిగా గోతులమయమై బస్సు సౌకర్యం నిలిచిపోయింది. దీంతో నిత్యం రాజాం పనులు పాఠశాలలకు చేరాల్సిన విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆదివారం గ్రామస్థులంతా ఒక్కటై కొంత మొత్తం సేకరించారు. ఈ మొత్తంతో ప్రొక్లయినర్లు, ట్రాక్టర్లు పెట్టి సమీప కొండల నుంచి మట్టి తవ్వకాలు జరిపి గోతులు పూడ్చుతున్నారు. గత ఎన్నికల ముందు వైసీపీ నాయకులు రహదారి పనులకు రూ.1.50కోట్లు మంజూరయ్యాయని, పనులు ప్రారంభించినట్టు హడావిడి చేశారని.. తీరా గుత్తేదారు ముందుకు రాకపోవటంతో పనులు చేపట్టలేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


బాగెమ్మపేట రహదారిలో గోతులు పూడుస్తున్న గ్రామస్థులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

శృంగవరపుకోట రూరల్, జూలై 21: మండలంలోని రాజీపేట శంబలనగరి వేదగాయత్రి మాత ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను సంబరంగా నిర్వహించారు. ఆదివారం ధ్యానం అమ్మలక్ష్మి ఆధ్వర్యంలో ట్రస్టుబోర్డు చైర్మన్ సాంబశివరావు, సదాశివరావు, రమేష్, హనుమశ్రీ, కిషోర్ ఆధ్వర్యంలో ఈఏడాది జరిగిన పది పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందించారు. ఇందులో భాగంగా ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించిన వారికి వెండిపతకాలు, నగదుబహుమతులు ఇచ్చారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


విద్యార్థులతో శంబలనగరి ప్రతినిధులు

పైపులైన్ల లీకులు..తాగునీటికి అవస్థలు

● పార్వతీపురంలో నిర్వహణ లేక సమస్యలు



జిల్లా ఆసుపత్రి కూడలి వద్ద పైప్‌లైన్‌కు లీకు పడిన దృశ్యం

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలో పైప్ లైన్‌లీకుల వల్ల తాగునీటి సమస్య మరింత తీవ్ర తరమవుతోంది. మునిసిపాలిటీ ఏర్పడిన సమయంలో ఏర్పాటుచేసిన ప్రధాన తాగునీటి పైప్ లైన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడిపడితే లీకులు ఏర్పడుతున్నాయి.ఇప్పటికే వర్షాకాలంలో కుళాయిల నుంచి రంగుమారిన తాగు నీరుసరఫరా అవుతుండడంలో ప్రజలుఇబ్బందులు పడుతున్నారు.దీనికితోడు ఎక్కడపడితే అక్కడ పైప్‌లైన్‌కు లీకులు పడుతుండడంతో తాగు నీరు కలుషితమై రోగాలబారినపడే అవకాశముం దని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ ఇంజినీరింగ్ అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్ లీకులకు సంబంధించి మరమ్మతులు చేపట్టాలని జిల్లా కేంద్రవాసులు కోరుతున్నారు. కాగా యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మతులను చేపడతామని మునిసిపల్ ఇంజినీరింగ్ విభాగం డీఈ కిరణ్ తెలిపారు.

పార్వతీపురంలో వ్యాసపాదుకార్చనలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దామోదరరావు

పార్వతీపురంటౌన్: పట్టణ శివారులోని సూర్యపీఠంలో పీఠాధిపతి వేమకోటి నరహరశాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం వ్యాసపాదుకార్చనలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు జిల్లా రెండవ అదనపు న్యాయాధికారి దామోదరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాసభగవానుడుతో విస్తరించబడిన సంస్కృత భాషా వికాసమే నేటికి అనుసరించబడుతుందన్నారు. అనంతరం శాస్త్రి, రుత్వికుల వేదమంత్రోశ్చరణల మధ్య గురుపాదార్చనలు, హోమాలు, గురుమండప పూజలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి వి.వివేకానంద, ఉమాశర్మ, హర్షశర్మ, ఆర్‌.కే శర్మ వైదిక సహకారాన్ని అందించారు.

బీమా చెక్కు పంపిణీ

పాలకొండ: పట్టణంలోని పెదకాపువీధికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యురాలు దుప్పాడ కుమారి ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాణంలో మృతిచెందాడు. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులకు రూ.ఐదు లక్షల చెక్కును జనసేన రాష్ట్ర పీఏసీ చైర్మన్ నాగబాబు మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆదివారం అందించారు. కార్యక్రమంలో జనసేన పాలకొండ నియోజకవర్గ నాయకులు గర్భాన సత్తిబాబు, జనసేన నాయకులు గులివెందుల లక్ష్మణ్, జనసేన శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, మాదాసి సంతోష్ పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



బస్సును తోస్తున్న ప్రయాణికులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలోని ప్రధాన రహదారిలో కర్షక మహర్షి ఆసుపత్రికి వెళ్లే కూడలి వద్ద కూనేరు నుంచి పార్వతీపురం ఆర్టీసీ డిపోకు వస్తున్న బస్సు ఆదివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో మొరాయించింది. దీంతో ంచారం లేకపోవడంతో బస్సు ఆగిపోయినాట్రాఫిక్ స్తంభిం చలేదు. బస్సును ప్రయాణికులు తోయడంతో స్టార్ట్ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా సాంకేతిక లోపాలతో పాటు రహదారులు అధ్వానంగా ఉండడంతో ఎప్పటికప్పుడు బస్సులు ఆగిపోతున్నాయని ఆర్టీసీ డీఎం దుర్గా దేవి తెలిపారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

సాలూరు: సమస్యల పరిష్కారంకోసం ఈనెల 29న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం సాలూరు కమిటీ నాయకులు జె.హరిబాబు, టి.విజయ్, టి.లక్ష్మి కోరారు. ఈ మేరకు ఆదివారం సాలూరులో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూ సమస్యలను నివారించి దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా దళితులు, గిరిజనులు,బీసీలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులపై దాడి చేసిన పెత్తందారులను శిక్షించాలని కోరారు. భూసమస్యలు పరిష్కారంలో జిల్లా అధికార్లు తాత్సరం చేస్తున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న భూముల్లో హక్కులు పొందకపోవడం వల్ల దళితులు, గిరిజనులు, బీసీలు నష్టపోతున్నారని విమర్శించారు.అధికారుల సమస్యలు పరిష్కారిస్తామని హామీలు ఇవ్వడం తప్ప తీసుకున్న చర్యలు ఏమీ లేవని ఆరోపించారు. అధికారుల తీరుకు నిరసనగా చేస్తున్న నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

పామాయిల్ గెలల తరలింపుపై ఫిర్యాదు

కురుపాం: తమ పరిధిలో గల గ్రామాల్లో నుంచి పామాయిల్ గెలలను చట్ట వ్యతిరేకంగా సంకిలి సమీపంలో గల శ్రీనివాస ఆయిల్ మిల్లుకు తరలిస్తుండడంతో, వారిపై చర్యలు తీసుకోవాలని లక్ష్మీ బాలాజీ పామాయిల్ కంపెనీ మేనేజర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సంలో పామాయిల్ లక్ష్యం, మేగా ప్లాంటేషన్ డ్రైవ్‌పై ఆయిల్ పామ్ కంపెనీలు, ఉద్యానవనశాఖ అధికారులకు జరిగిన సమీక్షలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు ఉద్యానవన శాఖ ద్వారా అందిస్తే చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు: సీఐ



కుశిమి జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సూర్యచంద్రమౌళి

సీతంపేట: మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకుపాల్పడితే కేసులు తప్పవని సీఐ సూర్యచంద్రమౌళి స్పష్టంచేశారు. ఆదివారం కుశిమి జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలని వాహనచోదకులకు సూచించారు. ట్రిపుల్ రైడ్ వల్ల యువత ప్రమాదాలకు గురవుతున్నారని, వాటిపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో విజృంభిస్తున్న మలేరియా

రాయగడ: రాయగడ జిల్లాలో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. పలు గ్రామాల్లో కేసులు పెరిగిపోవడంతో ఆశా,అంగన్‌వాడీ వర్కర్లు పర్యటించి మందులు అందజేస్తున్నారు.ఆశ్రమ, ప్రాథమిక,పాఠశాలల విద్యార్థులు మలేరియా బారినపడ్డారు.రాయగడలోని కేంద్రాసుపత్రిలో చేరుతున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతోపడకలు కొరత వల్ల నేలపైనే వైద్య మందించాల్సివస్తోంది. పాఠశాలలు,హాస్టల్ పరిశరాలు పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు చైతన్య పరిస్తున్నారు.జిల్లాలోని తడమా, బిల్లేసు, కెరడ, కళ్యాణసింగపూర్, బార్కపాల్మ పర్సాలి, బుడగుడ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన రక్త పరీక్షల్లో మలేరియా కేసులు వెలుగుచూశాయి. దీంతో వైద్యాధికారులు నియంత్రణ చర్యలు చేపట్టారు.



ఆసుపత్రిలో నేలపైనే వైద్యసేవలు పొందుతున్న రోగులు

తీర గ్రామాల్లో అప్రమత్తం

● నాగావళి, వంశధార నదుల్లో పెరుగుతున్న ప్రవాహం ● గ్రామాల్లో అధికారుల సందర్శన ● హఠాత్తుగా వరదలు వచ్చే అవకాశం

నాగావళి, వంశధార క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తరంగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నదుల్లో ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. ఈ రెండు నదులకు సమీప గ్రామాల్లోకి నీరుచేరే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో ఆదివారం వంశధార నది పరిధిలోని భామిని మండలం, నాగావళి పరిధిలోని వీరఘట్టం, కొమరాడ తదితర మండలాల్లో రెవెన్యూ పంచాయతీ అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తంచేశారు. నదుల్లో ప్రవాహం పెరిగే అవకాశం ఉండడంతో బయటకు రావొద్దని సూచించారు.



భామిని: లివిరి వద్ద వంశధార వద్ద పరిశీలిస్తున్న అధికారులు



వీరఘట్టం: కిమ్మిలో నాగావళి వరద పరిస్థితి పరిశీలిస్తున్న అధికారులు

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

భామిని: వంశధార నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని తహశీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం లివిరి గ్రామాన్ని సందర్శించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. వర్షాలు కురిసి హఠాత్తుగా వరదలు వచ్చే పరిస్థితి ఉందని, చిన్నారులు, మహిళలు అప్రమత్తంగా ఉండాల తెలిపారు. రానున్న మూడు నెలల పాటు వర్షాకాలం కావడంతో హఠాత్తుగా వర్షాలు కురిసి వరదలు వచ్చే అవకాశముందని చెప్పారు. నదీతీర ప్రాంతాల్లో నేరడి, బిల్లుమడ, సింగిడి, పసుకుడి, బాలేరు తదితర నదీతీర గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. నది పరిస్థితిపై స్థానికులను అడిగి తెలుసుకు న్నారు. కార్య క్రమంలో ఆర్ఐ రాంబాబు, విఆర్‌వో శంకరరావు, స్థానికులు పాల్గొన్నారు

నదిలో పడవలు వేయవద్దు

వీరఘట్టం: నాగావళి నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఈ మేరకు నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశాలు ఉండడంతో ఆదివారం తహసీల్దార్ కె.జయప్రకాష్,ఎంపీడీవో ఎంవీవీ సుబ్రహ్మణ్యం కిమ్మి,కడకెల్ల నదీతీర గ్రామాలను ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో అధికారులతో మాట్లాడారు. వర్షాల వల్ల నదీ ప్రవాహం పెరిగే అవకాశాలు ఉండడంతో పిల్లలను నదివైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవా లని కోరారు. నదిలో పడవలు వేయవద్దని తెలిపారు. మండలంలోని చిట్టిపుడివలస, బిటివాడ, పనసనందివాడ, పాలమెట్ట, విజయరాంపురంల్లో కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బంది ఆయాగ్రామస్థులకు సూచనలు ఇవ్వాలని చెప్పారు. ప్రమాదాలు జరిగిన వెంటనే తహసీల్దార్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ తెలియజే యాలని సిబ్బందికి ఆదేశించారు. కార్య క్రమంలో పంచాయతీ సె క్రటరీ పి.తిరుపతిరావు పాల్గొన్నారు.



వీరఘట్టం: పూజల్లో పాల్గొన్న భక్తులు



గుమ్మలక్ష్మీపురం: షిర్డీసాయి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



పార్వతీపురంటౌన్: ఎస్‌ఎన్‌ఎంనగర్‌లో షిర్డీ సాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

● షిర్డీ సాయి బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కురుపాం: గాయత్రీ ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

గురుపౌర్ణమిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు షిర్డీ సాయి బాబా ఆలయాల్లో పాలు, పెరుగు, నెయ్యితో ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. సాయిబాబా విగ్రహాన్ని ఊరేగించి, భజనలు చేశారు.అలాగే పలుచోట్ల షిర్డీ సాయిబాబా ఆలయాల్లో సుదర్శన హోమాలు, గీతా పారాయణం నిర్వహించారు. విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గురువులు, అయ్యప్పస్వాములను సన్మానించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



మక్కువ: గురుపూజోత్సవంలో పాల్గొన్న భక్తులు



సీతానగరం: గురువులను సత్కరిస్తున్న దృశ్యం



గరుగుబిల్లి: సాయినాథుని పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు



భామిని: సింగిడి బాబా ఆలయంలో దర్శించుకుంటున్న భక్తులు

అడుగడుగునా గోతులు.. ప్రయాణికుల పాట్లు

● వైసీపీ హయాంలో తూతూమంత్రంగా మరమ్మతులు

● ఇదీ పార్వతీపురంలో ప్రధాన రహదారిలో పరిస్థితి

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలోని ప్రధాన రహదారిలో భారీ గుంతల ప్రయాణికులు, వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. వైసీపీ హయాంలో పార్వతీపురంలోని బెలగాం నుంచి రాయగడ రోడ్డు వరకు ఉన్న గుంతలను తూతూమంత్రంగా పూడ్చారు.దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భారీగుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా పాతబస్టాండ్ కూడలి నుంచి రాయగడ రోడ్డు శివారు వరకు అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రవాసులు కోరుకుంటున్నారు. కాగా జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు పార్వతీపురం నియోజకవర్గంలోని సీతానగరం నుంచి కురుపాం నియోజకవర్గంలోని కూనేరు వరకు అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణం కోసం రూ.ఐదు కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆర్‌అండ్‌బీ డీఈ అప్పాజీ తెలిపారు.



రాయగడ రోడ్డులో గల కొత్తవీధి ఎదురుగా ప్రధాన రహదారిలో ఏర్పడ్డ భారీ గుంత

తవ్వారు.. మరిచారు

● ఇదీ వీరఘట్టం రహదారి మధ్యలో పరిస్థితి



రోడ్డు మధ్యలో గుంతను తవ్విన దృశ్యం

వీరఘట్టం: వీరఘట్టం గ్రోమోర్ ఎంటర్ వద్ద రహదారి మధ్యలో సీసీ కెమెరా ఫోల్ అమర్చేందుకు గోతులు తవ్వారు. రోజులు గడుస్తున్నా అమర్చడం మరిచి పోయారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే రహదారిలో ఏ క్షణం ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన ఎందుతున్నారు. కాగా ఈ విషయం పోలీస్ అధికారులకు తెలియజేశామని, త్వరలో అమర్చుతామని పంచాయతీ ఈవో పి.రాము తెలిపారు.

నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, కురుపాం ప్రాంతాల్లో చెలామణి అవుతున్న నకిలీ వైద్యులపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గిరిజన నాయకుడు సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవలు మెరుగుపరచాలని కోరారు.

వైసీపీ కోవర్టులను సస్పెండ్ చేయాలి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడ్ని కోరిన ఆ పార్టీ నాయకులు

వీరఘట్టం: వైసీపీ కోవర్టులుగా పనిచేసిన పడాల భూదేవి, సామంతుల దామోదరరావు, ఖండాపు వెంకటరమణ, వారాడ సుమంత్‌నాయుడు, గుమ్మడి సింహాద్రి తదితరులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును పలువురు కోరారు. ఈ మేరకు ఆదివారం విశాఖపట్నంలో ఆయన్ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ నాయకులు నమ్మక పాండురంగారావు, కర్నేన అప్పలనాయు డు, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్‌భాస్కర్, గంటా సంతోష్, గండి రామినాయుడు, రవినాయుడు, జామి లక్ష్మీనారాయణ కలిసి వినతిపత్రం అందించారు.



శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోతులు తవ్వేశారు.. వదిలేశారు

● తిత్తిరి పంచాయతీలో గిరిశిఖర గ్రామాల ప్రజల అవస్థలు



తిత్తిరి రోడ్డులో కప్పకుండా వదిలేసిన ట్రెంచ్

కురుపాంరూరల్: కురుపాం మండలంలోని తిత్తిరి పంచాయతీ పరిధిలో గల గిరిశిఖర గ్రామాలకు ప్రైవేటు నెట్‌వర్క్ కేబుల్ లైన్లు ఏర్పాటుకు తవ్విన గోతులు నేటికీ పూడ్చలేదు. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. గిరిశిఖరానఉన్న తిత్తిరి పంచాయతీ ప్రజలకు ప్రైవేటు నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఇటీవల కేబుల్ లైన్లువేశారు. ఈమేరకు యంత్రాలతో రోడ్డుమార్జిన్‌లో ట్రెంచ్‌లుతవ్వారు. అయితే కేబుళ్ల వేసిన తర్వాత ట్రెంచ్‌లు కప్పకపోవడంతో రోడ్డు కోతకు గురవుతోంది. ఈ మార్గంలో రోడ్డు ఇరుగ్గా ఉండడంతోపాటు మలుపులు, ఘాట్ రోడ్డు, రోడ్డుకు ఇరువైపులా దట్టంగా తుప్పలు పెరగడం, రోడ్డు కోతకు గురవుతుండడంతో ట్రెంచ్ ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. తక్షణమే ఆర్‌అండ్‌బీ అధికారులు గోతులు కపాలని తిత్తిరి పంచాయతీ వాసులు కోరుతున్నారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న లారీ

వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికుల అవస్థలు

వీరఘట్టం: మండలంలోని చిదిమి జంక్షన్ మలుపు వద్ద లారీ అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. ఎస్ఐ కె.ప్రకుద్దీన్, సిబ్బంది వెంటనే స్పందించి రెండు యంత్రాల సహాయంతో లారీను పక్కకు తీసి ట్రాఫిక్ క్లియర్‌చేశారు. ఈప్రమాదం చోటుచేసుకోవడంతో కిలో మీటర్ల పొడవున వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ మలుపు వద్ద నిత్యం ప్రమా దాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు పూర్తిస్థాయిలో రక్షణగోడను నిర్మించి ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



లారీ ప్రమాదంతో నిలిచిపోయిన వాహనాలు